
సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం। 31। జులై। 2023



కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీలోకి ఆదివారం నాలుగు గేట్ల ద్వారా 10,284 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. ప్రస్తుతం 20.56 టీఎంసీలు నిల్వ ఉంది.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు గెరువు ఇవ్వడంతో రాజన్నను ఆదివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



రెడ్డి సంఘం పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కోనరావుపేటలో రెడ్డి సంఘం భవన బ్యాలెన్స్ పనులకు రూ.5 లక్షల మంజూరుపత్రాన్ని ఇచ్చి పనులు ప్రారంభించారు. రూ.1.70 లక్షలతో బోరుమోటార్‌ను ప్రారంభించారు. మరిమడ్లలో వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. చెక్‌డ్యాం వద్ద పొలాల్లో నిండిన ఇసుకను తొలగించాలని ఇరిగేషన్ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచ్ పోకల రేఖ, ఎంపీటీసీ చారి, నాయకులు రాఘవరెడ్డి, రమణారెడ్డి, జీవన్‌గౌడ్, సంతోష్, రెడ్డి సంఘం అధ్యక్షుడు కస్తూరి సంజీవరెడ్డి, మరిమడ్ల సర్పంచ్ మాట్ల అశోక్, ఏఎంసీ డైరెక్టర్ రాజేశం, రాఘవరెడ్డి, దేవరాజు తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న అంకని భాను

సిరిసిల్లటౌన్: వరదలతో పంట నష్టపోయిన రైతులను, ఆస్తి నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు తక్షణమే ఎకరాకు రూ.లక్ష చెల్లించాలని, ఆస్తినష్టంపై విచారణ చేపట్టి నష్ట పరిహారం అందించాలని కోరారు. బోనాల చెరువుకు మరమ్మతులు చేసి ఉంటే సిరిసిల్ల పట్టణానికి వరద నుంచి నష్టం వాటిల్లేది కాదన్నారు. లింగన్నపేట వాగుపై వంతెన నిర్మించాలని, చెక్‌డ్యాంలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, నాయకులు లింగంపల్లి మధుకర్, బానోతు నంద్యానాయక్, దొబ్బల నరేశ్, తడుక భాను పాల్గొన్నారు.

డెవిల్ ఫిష్



వలకు చిక్కిన డెవిల్ ఫిష్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు శివారులో గల మానేరువాగులో ఆదివారం డెవిల్ ఫిష్ చిక్కింది. దాదాపు 500 గ్రాముల ఉండే ఈ చేప భయం కలిగించే ఆకారంలో ఉంది. చేప మొత్తం ముళ్లతో ఉండి చర్మం వింత డిజైన్‌తో ఉండడంతో స్థానికులు దెయ్యం చేప అంటూ చర్చించుకున్నారు. వీటిని తినరని మత్స్యకారులు పేర్కొన్నారు.

సిరిసిల్లలో ఫ్రాంకింగ్ మిషన్ సేవలు



ఫ్రాంకింగ్ మిషన్‌లో స్టాంపింగ్ చేస్తున్న అశోక్

సిరిసిల్లఎడ్యుకేషన్: బ్యాంకు రుణాలు, ఫైనాన్స్‌లు, క్రయవిక్రయ ఒప్పంద పత్రాలపై అవసరమైన స్టాంపులు ముద్రించే ఫ్రాంకింగ్ మిషన్ సిరిసిల్ల కేంద్రంలో అందుబాటులోకి వచ్చింది. దీనికి గురించి ఫ్రాంకింగ్ మిషన్ నిర్వాహకుడు చిట్యాల అశోక్ ఆదివారం మాట్లాడుతూ రుణాలు, ఒప్పందపత్రాలపై స్టాంపుల కోసం గతంలో కరీంనగర్ వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు సిరిసిల్లలోనే అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం అనుమతితో సేవలందిస్తామని తెలిపారు.

మేధావులు మేడిన్ ఎస్సారార్



ప్రభుత్వ ఉద్యోగులు.. రాజకీయ నాయకులు.. కవులు.. కళాకారులకు పుట్టినిల్లు కరీంనగర్‌లోని ఎస్సారార్ (శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ) కళాశాల. సాధారణ విద్యార్థిగా చేరి.. విద్యార్థి నాయకులుగా, రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసే కవులుగా సరిహద్దుల్లో రక్షణగా నిలుస్తున్న సైనికులుగా ఇక్కడి ఎన్‌సీసీ కెడెట్లే అధికం. బడుగు బలహీనవర్గాలకు సేవ చేస్తున్న వారిలో ఇక్కడి నుంచే వెళ్లిన ఎన్‌ఎస్‌ఎస్ అభ్యర్థులూ ఉన్నారు. ఇలా అన్ని రంగాల్లో తన విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిన ఎస్సారార్ కాలేజీ సగర్వంగా తలెత్తుకు నిలబడింది. కరీంనగర్ నగర నడిబొడ్డున 26 ఎకరాల విస్తీర్ణంలో నిల్చొని విద్యాకుసుమాలను సమాజానికి అందిస్తోంది.



కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ సిటీ: 'కరీంనగర్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు సెలక్షన్స్ జరుగుతున్నాయి. అందులో ఎంపికైన అభ్యర్థుల్లో దాదాపు 70 శాతం మంది ఎస్సారార్‌కు చెందినవారే. ఇది గమనించిన ఓ అధికారి ఆరా తీయగా.. ఆ కాలేజీలో విద్యార్థులకు ఎన్‌సీసీలో ఇచ్చే కఠోర శిక్షణే కారణమని తెలిసింది'

- శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. డిగ్రీ, పీజీ చదువుకున్న ప్రతి వ్యక్తికీ ఈ కాలేజీ తెలుసంటే అతిశయోక్తి కాదు. ఇందులో చదువుకోవాలని ప్రతి విద్యార్థి కల. ఇక్కడ సాధారణ విద్యార్థులే ప్రవేశాలు పొందుతారు. చేరాక విద్యతోపాటు వికాసం, క్రమశిక్షణ(ఎన్‌సీసీ), నాయకత్వం, సామాజిక సేవ(ఎన్‌ఎస్‌ఎస్), పరిశోధనలు(ల్యాబ్), క్రీడలు, కళలు ఇలా అన్ని విధాలా తీర్చిదిద్దబడి బయటకొస్తారు.
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న ఈ కాలేజీ 10 జిల్లాల విద్యార్థులకు వరంగా మారుతోంది. కవులు, కళాకారులు, నాయకులు, పోలీసులు, అధికారులు, ఉద్యోగులను సమాజానికి అందించిన ఈ కాలేజీ నాటి వైభవానికి నేటి ఆధునికతకు వారధిగా నిలుస్తోంది.
- శ్రీరాజరాజేశ్వర ఆలయం, వేములవాడ పేరున 1956లో ప్రైవేట్ భాగస్వామ్యంలో కాలేజీని స్థాపించారు. మొదటి ప్రిన్సిపాల్‌గా ఏవీ గోపాలరావు వ్యవహరించారు. 1959లో అప్పటి సర్కారు దీన్ని ప్రభుత్వ కాలేజీగా మార్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఈ కాలేజీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగారు. 1959–91 వరకూ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రొఫెసర్ చలపతిరావు, ప్రొఫెసర్ కేవై ఎల్.నర్సింహారావు హయాంలో అభివృద్ధికి బాటలు పడ్డాయి. 2018 నుంచి ప్రొఫెసర్ రామకృష్ణ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. కాలేజీ పరిధిలో 2016 వరకు 15 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా.. ప్రస్తుతం నాలుగు ఉన్నాయి. ఈ కాలేజీలో ప్రస్తుతం 45 డిగ్రీకోర్సులు, 11 పీజీ కోర్సులు, 5 సర్టిఫికెట్ కోర్సులు అందిస్తూ కాకతీయ వర్సిటీ తర్వాత ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద కాలేజీగా గుర్తింపు తెచ్చుకుంది. 2022 మార్చిలో యూజీసీ, న్యూఢిల్లీ నుంచి అటానమస్ హోదా లభించింది. న్యాక్ 'ఏ' గ్రేడ్ హోదా 2027 వరకూ ఉంది. వీటితోపాటు ఐఎస్‌వో సర్టిఫికెట్ కూడా పొందింది.

- విద్యార్థిగా చేరి.. ఉత్తములుగా అవతరించి
- విద్యార్థి నాయకుల నుంచి రాజకీయ నేతలుగా ఎదిగి..
- కవులు, కళాకారుల పుట్టినిల్లు
- మినీ యూనివర్సిటీగా ఖ్యాతి
- 45 డిగ్రీ కోర్సులు, 11 పీజీ కోర్సులు
- 5 సర్టిఫికెట్ కోర్సులు, 1,620 సీట్లు



అవార్డులు.. రివార్డులు

- దేశంలోనే ఎస్సారార్ కాలేజీ గ్రీన్ క్యాంపస్‌గా పేరుగాంచింది. గ్రీన్‌బిల్డింగ్ అవార్డును పొందింది.
- 64 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో యూనివర్సిటీ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు.
- జిజ్ఞాస ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రస్థాయిలో విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులో ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. 10 సార్లు వివిధ సందర్భాల్లో రాష్ట్రస్థాయి బహుమతులు గెలుచుకుంది.
- కాలేజీలో డాక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సెమినార్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 120 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.
- అధ్యాపకులు రాజు, మల్లారెడ్డి, వరప్రసాద్ తోపాటు మరికొందరు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక బహుమతులు అందుకున్నారు.
- డాక్టర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో 3 జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించారు. దీనికి 10 జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి విద్యావేత్తలు హాజరయ్యారు.
- శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డాక్టర్ భిక్షపతి, డాక్టర్ సతీశ్‌కుమార్‌కు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కల్పించారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న ఎన్‌సీసీ కెడెట్లు (ఫైల్)

ఎన్నో సౌకర్యాలు

- కరీంనగర్ సిటీ మధ్యలో మినీ యూనివర్సిటీగా పిలిచే ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ, పీజీ కాలేజీ 26 ఎకరాల సువిశాల ప్రాంగణంలో విస్తరించి ఉంది.
- 45 డిగ్రీ కోర్సుల్లో 1,620 సీట్లు అందుబాటులో ఉండగా తాజాగా 'దోస్త్' మొదటిఫేజ్‌లో 1,016 సీట్లు భర్తీ అయ్యాయి.
- 108 తరగతి గదులు ఉండగా పూర్తిగా ఆధునీకరించిన బోటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయలాజీ తదితర 10 ల్యాబ్‌లున్నాయి.
- కాలేజీలో జిమ్, గ్రంథాలయంలో 53,450 పుస్తకాలు, 15 జర్నల్స్, 25 మ్యాగజైన్స్, 18 వార్త పత్రికలు కాలేజీకి చేరుతుంటాయి.
- ఎస్సారార్ వివిధ విభాగాల్లో 67 మంది(వాస్తవానికి 89) అధ్యాపకులు వివిధ విభాగాల్లోని అంశాలు బోధిస్తున్నారు. 42 మంది గెస్ట్‌లెక్చరర్లు, 25 మంది నాన్-టీచింగ్ స్టాఫ్ ఉన్నారు.



- అతిపెద్ద ఆడిటోరియం, మినీ ఆడిటోరియం కూడా అందుబాటులో ఉన్నాయి.
- ఎన్‌ఎస్‌ఎస్ ఐదు యూనిట్లలో 600 మంది విద్యార్థులు కెడెట్లుగా ఉన్నారు.
- ఎన్‌సీసీలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు, రివార్డులు పొందారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన పలు అడ్వెంచర్ క్యాంపుల్లో ఎస్సారార్ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాలుపంచుకున్నారు.
- ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఐక్యూఏసీ, ఇప్‌ప్లూ బినెట్, మన టీవీ పాఠాలు, జిజ్ఞాస, మూక్స్, టాస్క్, స్వయం ఉపాధి వంటి పథకాలు అమలు చేస్తున్నారు.
- రెడ్డిల్యాబ్, మహేంద్ర వంటి కంపెనీలలో పరస్పరం ఒప్పందంతో విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి



అటానమస్ హోదాతో ఉన్న ఎస్సారార్ కాలేజీలో విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం. అధ్యాపకుల సహాయంతో నూతన విధానాలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల ఆసక్తి మేరకు వారికి పలు సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తున్నాం. దోస్త్ మొదటి ఫేజ్‌లోనే రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు భర్తీ అయ్యాయి. స్వయం ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్, ఎస్సారార్ కాలేజీ(అటానమస్)

నాయకుడిగా జన్మనిచ్చింది



విద్యార్థి రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన కాలేజీ ఎస్సారార్. విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు కాలేజీలోనే అలవడ్డాయి. బీసీ రిజర్వేషన్ల కోసం జరిగిన దేశవ్యాప్త ఉద్యమంలో కాలేజీలో ఎన్ఎస్‌యూఐ తరపున చురుగ్గా పాల్గొన్నాను. అదే నాకు గుర్తింపును తెచ్చింది. ఈరోజు సమాజ సేవ చేసే అదృష్టం లభించిందంటే ఎస్సారార్ కాలేజీనే కారణం.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ

పుష్కలమైన వనరులున్న కాలేజీ



దేశంలో ఏ ప్రైవేటు కాలేజీకీ తీసిపోని అధునాతన సదుపాయాలు ఎస్సారార్ కాలేజీ సొంతం. తరగతి గదులు, మైదానం, గ్రంథాలయం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, ల్యాబ్స్ ఒకటేమిటి.. అనంతమైన వనరులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు రత్నాల్లా రాటుదేలుతారు. ఎన్ని ప్రైవేటు కాలేజీలు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగాల్లో అధికశాతం ఎస్సారార్ కాలేజీ విద్యార్థులే సాధించడం ఇందుకు నిదర్శనం.

– వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

అసమర్థ ఎమ్మెల్యేతో కుంటుపడుతున్న అభివృద్ధి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు వైఫల్యంతో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని కొండాపూర్ శివారులో సిరిసిల్ల–నిమ్మపల్లి ప్రధాన రహదారిపై వర్షాలకు కొట్టుకుపోయిన పెంటివాగు వంతెనను ఆదివారం సందర్శించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా వంతెనలు తెగిపోతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి ప్రధాన రహదారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తాత్కాలిక పనులతో అధికార పార్టీ నేతలు జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వరదలతో రైతుల పొలాల్లో మట్టి, ఇసుక మేటలు వేస్తున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను గుర్తించి కోనరావుపేటలో జూనియర్ కాలేజీ, మోడల్‌స్కూల్, కేజీబీవీ తీసుకొచ్చామని.. అయితే అక్కడి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. మూలవాగు, పెంటివాగుపై తెగిన వంతెనలను వెంటనే నిర్మించాలని కోరుతున్నామన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, డీసీసీ కార్యదర్శులు చేపూరి గంగాధర్, తాళ్లపెల్లి ప్రభాకర్, జిల్లా నాయకులు రాస రవీందర్‌రెడ్డి, చందనగిరి గోపాల్, సదానందం, అజీమ్, శోభన్, ఎల్లయ్య, దేవరాజు, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి ఉన్నారు.



పెంటివాగును పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

సర్పంచ్.. డ్రైవర్ !

చందుర్తి(వేములవాడ): పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెతో గ్రామ సర్పంచ్ డ్రైవర్‌గా మారి ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. చందుర్తి మండలం మూడపల్లిలో హరితహారంలో భాగంగా ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కల పంపిణీ చేయించాలని మండల అధికారులు వారం రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేశారు. ట్రాక్టర్ నడిపించే పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామ సర్పంచ్ చిలుక అంజిబాబు స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఆదివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సీఏల సహాయంతో మొక్కల పంపిణీ పూర్తి చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పంబ పద్మ, తోట్ల రాధిక, సీఏలు బత్తుల వినోద, లక్ష్మి, ఆశవర్కర్ అరుణ పాల్గొన్నారు.



మూడపల్లిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా మారిన సర్పంచ్

అప్పుడే ఊడిపోతున్నాయి !

సిరిసిల్లక్రైం: కలెక్టరేట్ భవనంలో అప్పుడే దోర్లు ఊడిపోతుండగా.. ఫ్లోర్ పెచ్చులు లేస్తుంది. ఎంట్రీ గేట్ వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్స్ తలుపు విరిగిపోయింది. అక్కడే కిటికీకి ఏర్పాటు చేసిన గ్లాస్ లేదు. ఫ్లోరింగ్ బిచ్చులూడిపోతుంది. పార్కింగ్ ప్రాంతంలో లీకేజీ ఉంది. అలాగే ప్రజల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్ కంపు కొడుతున్నాయి.



జిల్లాలో చిరు జల్లులు

సిరిసిల్ల: జిల్లాలో ఆదివారం చిరుజల్లులు కురిశాయి. తొమ్మిది మండలాల్లో చినుకులు పడ్డాయి. రుద్రంగిలో 1.3 మిల్లీమీటర్లు, చందుర్తిలో 0.6, వేములవాడ రూరల్ 0.4, సిరిసిల్లలో 0.5, కోనరావుపేటలో 0.4, వీర్నపల్లిలో 0.3, గంభీరావుపేటలో 0.7, తంగళ్లపల్లిలో 1.2, ఇల్లంతకుంటలో 0.3 మిల్లీ మీటర్ల వర్షం పడింది. మిగతా నాలుగు మండలాలు బోయినపల్లి, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లో వర్షం పడలేదు.

చేనేత శిల్పకారుడికి సత్కారం



సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లకు చెందిన చేనేత శిల్పి వెల్ది హరిప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్‌లో ఘన సత్కారం లభించింది. మంగళగిరిలో జరిగిన ప్రపంచ చేనేత సదస్సుకు హాజరైన హరిప్రసాద్ చేనేతరంగంలో నిర్వహించిన ప్రయోగాలను నిర్వాహకులు ప్రశంసించారు. జీ20 లోగో, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రం, అగ్గిపెట్టెలో ఇమిడే చీర వంటి ప్రయోగాలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పరికిపండ్ల నరహరి, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల విచారణ



కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంలోని మామిడిపల్లిలో వర్షాలతో జరిగిన నష్టాలపై ఆర్డీవో పవన్‌కుమార్ ఆదివారం విచారణ చేపట్టారు. చెక్‌డ్యామ్ నిర్మాణంతోనే పొలాల్లో ఇసుకమేటలు వేశాయని రైతులు తెలిపారు. సుమారు 300 ఎకరాల్లో పంటలన్నీ ఇసుకతో నిండిపోయాయని అధికారులు అంచనా వేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

మరో మూడు పంచాయతీలు?



రాచర్ల బాకూర్‌పల్లి తండా



హీరాలాల్ తండా

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- నేడు కేబినెట్ సమావేశంలో నిర్ణయం

సిరిసిల్ల: జిల్లాలో మరో మూడు కొత్త గ్రామపంచాయతీలను ప్రతిపాదిస్తూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ శివారులోని రాచర్లబాకూర్‌పల్లితండా, సేవాలాల్‌తండా, గంభీరావుపేట మండలం ముచ్చర్ల శివారులోని హీరాలాల్(ముచ్చర్లతండా)లను కొత్త గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని సమగ్ర సమాచారాన్ని జిల్లా అధికారులు పంపించారు. ఆయా గ్రామాల్లో వార్డు మెంబర్ల స్థానాలను కూడా ఖరారు చేస్తూ ప్రతిపాదించారు.

మంత్రి కేటీఆర్ సూచనలతో..

కొత్త గ్రామపంచాయతీలుగా ప్రకటించాలని ఆయా గ్రామాల నుంచి ఇటీవల సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావుకు గ్రామస్తులు వినతిపత్రాలు అందించారు. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఆయా గ్రామాల్లో సర్వేలు నిర్వహించారు. 450 నుంచి 520 వరకు జనాభా ఉండడంతో కొత్త గ్రామ పంచాయతీలుగా ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదించారు. తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాచర్లబాకూర్‌పల్లి, సేవాలాల్‌తండాలను, ముచ్చర్ల పరిధిలోని హీరాలాల్‌తండాలను కొత్తపంచాయతీలు అవుతాయని భావిస్తున్నారు. ఆయా గ్రామాల భౌగోళిక స్వరూపం, ఇళ్ల సంఖ్య, జనాభా, ఓటర్ల వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపించారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగే కేబినెట్ సమావేశంలో కొత్త జీపీలపై నిర్ణయం తీసుకోనున్నారు.

పెరగనున్న జీపీలు

జిల్లాలో గ్రామపంచాయతీల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం 255 గ్రామపంచాయతీలు 2,240 వార్డు సభ్యుల స్థానాలు ఉండగా.. కొత్తగా మూడు గ్రామ పంచాయతీల పెంపుతో జిల్లాలో గ్రామాల సంఖ్య 258కి చేరనుంది. 2018 కంటే ముందు జిల్లా 199 గ్రామపంచాయతీలు ఉండేవి. జిల్లాలో 56 గ్రామ పంచాయతీలు కొత్తగా అయ్యాయి.

ముదిరాజ్‌లు సామాజికంగా ఎదగాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): సామాజిక ఉద్యమకారులు పూలే దంపతులను ఆదర్శంగా తీసుకొని ముదిరాజ్‌లు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రానవేని లక్ష్మణ్ కోరారు. కొండాపూర్‌లో జ్యోతిబా పూలే, సావిత్రిబాయిపూలే విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. లక్ష్మణ్ మాట్లాడుతూ పూలే దంపతులు వెనుకబడిన వర్గాలను చైతన్యవంతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేశారన్నారు. వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలని కోరారు. విగ్రహదాతలు సర్పంచ్ యారటి లక్ష్మి, చిగురు ఆదిమలన్, మెట్ల రెయిలింగ్ దాత కనమేని చక్రధర్‌రెడ్డిలను అభినందించారు. ముదిరాజ్ గ్రామశాఖ అధ్యక్షుడు చిగురు వెంకన్న, సర్పంచ్ యారటి లక్ష్మి, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు రాంగోపాల్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బండి శ్రీమతి, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, అడ్వకేట్ పిట్టల భూమేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్, రెడ్డబోయిన గోపి, గాడిచర్ల దేవయ్య, కరుణాకర్, గజ్జెల రాజు, మార్వాడి గంగారాజు, దేవేందర్, కిషన్, నందం, నర్సయ్య, రాములు, పర్శరాములు, కాశయ్య, నరేశ్, భూపతి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

మెట్టుకో ముళ్లే



రాజన్న గుడి మెట్లపై గాజుల ముళ్లెలు

వేములవాడ: వేములవాడ రాజన్న గుడిమెట్లనే నమ్ముకొని జీవిస్తున్న గాజుల అమ్మకందారులు పొద్దంతా గుడి మెట్లపైనే భక్తులకు గాజులు అమ్ముతూ ఉపాధి పొందుతుంటారు. రాత్రి వేళల్లో తమ గాజుల బుట్టలను గుడి మెట్లపైనే వదిలేసి రాజన్ననే దిక్కు అనుకుంటూ ఇంటికి వెళ్లిపోతున్నారు.

ఎంపీ బాపురావు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): లంబాడాల రిజర్వేషన్లు తొలగించాలని బీజేపీ ఎంపీ సోయం బాపురావు చేసిన వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలని జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య గజన్‌లాల్ నాయక్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఓట్ల రాజకీయం కోసం ఆదివాసీలను మోసం చేస్తున్న బాపురావు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే గ్రామాల్లో బీజేపీ నాయకులన తిరగనివ్వబోమని హెచ్చరించారు.

సామగ్రి దగ్ధం

చందుర్తి(వేములవాడ) : వ్యవసాయ పొలం వద్ద పనిముట్లను భద్రపర్చుకునేందుకు నిర్మించిన గదిలోని సామగ్రిని శనివారం రాత్రి దగ్ధం చేశారు. మండలంలోని జోగాపూర్‌కు చెందిన మ్యాదరి శంకరయ్య అనే రైతు పొలం వద్ద నిర్మించిన గది తలుపులు పగులగొట్టి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడేశారు. ఎరువుల బస్తాలతో పాటు మంచాన్ని దగ్ధం చేశారు. సుమారు రూ.50వేలపైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ సంఘటనకు పాల్పడింది గుర్తు తెలియని వ్యక్తులా ? లేక పాత కక్షలతో ఎవరైనా దగ్ధం చేశారా అన్నా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పరామర్శ



మధును పరామర్శిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామానికి చెందిన గ్రామశాఖ అధ్యక్షుడు చెరుకు ఎల్లం తల్లి మృతిచెందగా కుటుంబ సభ్యులను, దుమాలకు చెందిన మండల అధికార ప్రతినిధి మొగుళ్ల మధు అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ ఆదివారం పరామర్శించారు. పార్టీపరంగా అండగా ఉంటామన్నారు. ఆయనవెంట నాయకులు సాహెబ్, వంగ గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కరికె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూలిన బాధితురాలికి సాయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేటకు చెందిన నూకల ఎల్లవ్వ ఇల్లు పైకప్పు కూలిపోగా సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి టార్పాలిన్ కవర్ అందించారు. అంతేకాకుండా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉపసర్పంచ్ ఒగ్గు రజితయాదవ్, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్, నాయకులు నూకల శ్రీనివాస్‌యాదవ్, కొత్త వేణుయాదవ్, సంగ మల్లయ్య, ఏర్పుల హనుమయ్య, బాయికాడి చంద్రం ఉన్నారు.

పెద్ద చెరువు ముంచేసింది



చెరువుకు గండి పడి పొలాల్లోకి వెళ్తున్న నీరు



పంట పొలాల్లో ఇసుక మేటలు

- గండి పడటంతో చిన్నబోనాలలో నీటమునిగిన పంట పొలాలు
- ఎటుచూసినా ఇసుక మేటలే
- 150 ఎకరాలకు పైగా భూముల్లో నష్టం
- ఏడాది క్రితం ఏర్పడిన బుంగ
- అధికారులు పట్టించుకోలేదని రైతుల ఆరోపణ

సిరిసిల్లఅర్బన్: ఏడాది క్రితం సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలో పెద్ద చెరువుకు బుంగ ఏర్పడింది. మరమ్మతు చేయాలని స్థానిక రైతులు ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నారు. కానీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గురువారం చెరువుకు గండిపడింది. వరదనీరు ముంచెత్తడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఎటుచూసినా ఇసుక మేటలే కనిపిస్తూ భూములు సాగు చేసేందుకు వీల్లేకుండా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వందల ఏళ్ల క్రితం తవ్వకం..

చిన్నబోనాలలో పెద్ద చెరువు(బతుకమ్మ)ను వందల ఏళ్ల క్రితం తవ్వించినట్లు రైతులు తెలిపారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు మిషన్ కాకతీయ కింద పూడిక పనులు చేపట్టి, చెరువు కట్ట ఎత్తును పెంచారు.

కొట్టుకుపోయిన మోటార్లు..

పెద్ద చెరువుకు గండి పడటంతో చెరువు కింద ఉన్న 150కి పైగా ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరి పొలాల్లో బురద, ఇసుక మేటలు ఏర్పడ్డాయి. పలువురు రైతులకు చెందిన మోటార్లు నీటిలో కొట్టుకుపోయాయి. అప్పులు చేసి, వరి నాట్లు వేశామని, పెట్టిన పెట్టుబడి నీటిపాలైందని అన్నదాతలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయా భూముల్లో మళ్లీ సాగు చేయరాదని తెలిపారు. చెరువు నీరు దాదాపు 80 శాతం ఖాళీ అయ్యింది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పంట కొట్టుకుపోయింది



పెద్ద చెరువు కింద నాకు రెండెకరాల పొలం ఉంది. రెండు రోజుల క్రితమే నాటు వేశాను. ఇటీవలే పాత బావి పూడిక రూ.లక్షలు ఖర్చు పెట్టి తీశాను. భారీ వర్షాలకు పెద్ద చెరువుకు గండి పడి, పంట మొత్తం కొట్టుకుపోయింది.

– సలేంద్రి రాజు, రైతు, చిన్నబోనాల

పెట్టుబడి నీటిపాలు



40 రోజుల క్రితం మూడెకరాల్లో వరి వేశాను. రూ.40 వేల వరకు పెట్టుబడి అయ్యింది. చెరువుకు గండి పడి, వరద నీరు మొత్తం పొలంలో నుండి వెళ్లింది. దాదాపు ఎకరం పంటలో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. పెట్టుబడి నీటిపాలైంది.

–మెదుదుల మొండయ్య, రైతు, చిన్నబోనాల

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకు పెద్దబోనాల–చిన్నబోనాల రోడ్డులో రెండెకరాల పొలం ఉంది. రెండు రోజుల క్రితమే ఎకరం భూమిలో నాటు వేశాను. పెద్ద చెరువు వరద ఉధృతికి పక్కకే ఉన్న ఎకరం పంట కొట్టుకుపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి. – పిల్లి కనకయ్య, రైతు, పెద్దబోనాల

మరమ్మతు చేపట్టలేదు



గత వర్షాకాలంలో చెరువుకు బుంగ పడిన విషయాన్ని మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వచ్చి పరిశీలించారు. కానీ మరమ్మతు చేపట్టలేదు. ఇప్పుడు చెరువుకు గండి పడి, రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

– బొల్గం నాగరాజు, 10వ వార్డు కౌన్సిలర్, చిన్నబోనాల

అక్రమ కేసులు ఎత్తివేయాలి



గోవర్ధన్ గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌడ కులస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లారెడ్డిపేటలో గోవర్ధన్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గౌడసంఘం మండల అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్ సమక్షంలో బొప్పాపూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కొండ రమేశ్‌గౌడ్, జిల్లా డైరెక్టర్ గంట వెంకటేశ్‌గౌడ్, దత్తాత్రిగౌడ్, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమంలో వచ్చిన వార్తలపై గోవర్ధన్‌గౌడ్ క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. గౌడ సామాజిక వర్గానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న గోవర్ధన్‌గౌడ్‌పై పెట్టిన కేసులు వెనక్కి తీసుకోవాలని కోరారు. నాయకులు కోల నారాయణగౌడ్, పందిర్ల సుధాకర్‌గౌడ్, జవాజి మహేశ్‌గౌడ్, బాలరాజు సర్వాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లకు చెందిన పెకుడ రాధవ్వ (52) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. కాగా ఆదివారం రాధవ్వ మృతిచెందింది. నిరుపేద కుటుంబం కావడంతో పలువురు దాతలు చందాలు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్ మాట్ల మధు, బీఆర్‌ఎస్ నాయకులు పబ్బతి విజయేందర్ రెడ్డి, మిరాల భాస్కర్ యాదవ్ చందాలు అందజేశారు.

నీట మునిగిన పంట పొలాలు..

- చెక్‌డ్యాం పనుల్లో అధికారుల నిర్లక్ష్యం
- ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే అంటూ రైతుల ఆగ్రహం
- కోట్లాది రూపాయలు వృథా..



బొల్లారంలో చెక్‌డ్యాం పక్కన కొట్టుకుపోయిన పంటలు

వేములవాడ రూరల్: వేములవాడ మూలవాగులో కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులు వృథాగా మారాయి. మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంల నిర్మాణానికి కోట్లాది రూపాయలు కాంట్రాక్టు దక్కించుకున్న సదరు వ్యక్తులు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో పనుల్లో నాణ్యత కొరవడి వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేములవాడ రూరల్ మండలంలోని బొల్లారం, లింగంపల్లి, మల్లారం, జయవరం గ్రామాల పరిధిలో మూలవాగుపై చెక్‌డ్యాంలు నిర్మించారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాంలను సకాలంలో పూర్తిచేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆయాప్రాంతాల్లో రైతుల పంటపొలాలు నీట మునిగి పంటలు మునిగాయి. సకాలంలో చెక్‌డ్యాంలను పూర్తి చేయకపోవడంతోనే నష్టం వాటిల్లినట్లు ఆయా గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

‘అల్ఫోర్స్’ అధినేతకు సన్మానం



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి ప్రతిష్టాత్మక ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న విషయం విధితమే. ఈ సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని వావిలాలపల్లి అల్ఫోర్స్ జూనియర్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో ఆయనను ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మ రిన్ని అవార్డులు అందుకొని, జిల్లా కీర్తిని చాటాలని సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథరెడ్డి, సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.

బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు మానుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ గౌడ్

సిరిసిల్లఅర్బన్: బీఆర్‌ఎస్ నాయకులు అనవసరమైన విమర్శలు మానుకొని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డీసీసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు విషయంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణిని విమర్శిస్తే మున్సిపల్ చైర్‌పర్సన్ జోక్యం చేసుకొని మాట్లాడడం సరికాదన్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలతో హౌస్ అరెస్టు అయ్యానని, నాలుగేళ్ల నుంచి జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశానని తెలిపారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కామిని వనిత మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిందో ఏమిటో ప్రజలకు తెలుపాలని ఎద్దేవా చేశారు. కేకే మహేందర్ రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. కౌన్సిలర్లు లలిత, నిర్మల, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, దేవరాజు, ప్రకాశ్, భాను, మల్లేశం, భాను తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా .. అన్నదాతకు ధీమా

- జిల్లాలో 1,877 కుటుంబాలకు అందిన బీమా సాయం
- వచ్చేనెల 5వరకు పేర్ల నమోదుకు అవకాశం
- కొత్తగా 9,275 మంది దరఖాస్తుకు అర్హులు
- ఇప్పటివరకు నమోదు చేసుకున్న రైతులు 73,493



మర్రిగడ్డ రైతు వేదికలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏఈవో

చందుర్తి (వేములవాడ): తెలంగాణ ప్రభుత్వం 2018లో రైతుబీమా పథకాన్ని ప్రారంభించింది. రైతు ఏ విధంగా చనిపోయినా బీమా వర్తిస్తుంది. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది. కొత్తగా పాసు పుస్తకాలు పొందిన రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారులు ప్రచారం చేస్తున్నారు. గతేడాది రెన్యువల్ అయిన రైతుల కాలపరిమితి ఈ నెలలో ముగియనుండడంతో మళ్లీ బీమా అవకాశం కల్పించడంతో పాటు కొత్త వారిని పథకంలో చేర్పేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మార్గదర్శకాలివే..

రైతు బీమాకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం జారీచేసింది. జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాలవారీగా ఏఈవోలు, ఏవోలు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొంది, బీమాలో చేరేందుకు అవకాశం ఉన్న పేర్లను గ్రామాలవారీగా ప్రకటించి దరఖాస్తు చేసుకునేందుకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో జూన్ 18లోపు కొత్త పాసు పుస్తకాలు పొందిన వారు, పోడు పట్టాదారులు 9,275 మంది రైతులు నమోదుకు అర్హులని అధికారులు తెలుపుతున్నారు. 59 సంవత్సరాలు దాటిన వారి పేర్లను బీమా నుంచి తొలగిస్తున్నారు.

దరఖాస్తు విధానం..

పట్టాదారు పాసు పుస్తకంతో పాటు రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు పత్రాన్ని పూర్తిచేసి తమ క్లస్టర్ ఏఈవోలకు అందించాలి. కొత్త పాసుపుస్తకం ఇంకా రానివారు తహసీల్దార్ డిజిటల్ సంతకంతో కూడిన పాసు పుస్తకం నకలు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోడు భూముల పట్టాదారుల దరఖాస్తులు

ఈఏడాది జూన్ 18 వరకు ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తయిన పోడు భూముల రైతులు, కొత్తగా పాస్‌పుస్తకాలు వచ్చినవారు వారిపేర్లను రైతు బీమా కోసం నమోదు చేసుకోవచ్చు.

గడువు దాటితే ఏడాది ఆగాల్సిందే

గడువులోపు దరఖాస్తు చేసుకోకపోతే బీమా కోసం ఏడాది ఆగాలని వ్యవసాధికారులు తెలుపుతున్నారు. ఆగస్టు 5లోపు దరఖాస్తుకు గడువు ముగుస్తుంది. పథకం ప్రారంభించిన మొదటి రెండేళ్ల పాటు ఎప్పటికప్పుడు దరఖాస్తులు స్వీకరించి పేర్లు నమోదు చేశారు. ఏటా వానా కాలంలో మాత్రమే నిర్ణీత గడువులోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

జిల్లాలో 1,877 కుటుంబాలకు బీమా సొమ్ము

ఐదేళ్లలో జిల్లాలోని 1877 మంది రైతులు వివిధ కారణాలతో మృతిచెందగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున ఆర్థికసాయం అందించింది. పథకం ప్రారంభించిన రెండేళ్లలో అధికారులే పేర్లు నమోదు చేస్తారన్న నమ్మకంతో జిల్లాలో ఎంతోమంది రైతు కుటుంబాలకు బీమా అందకుండా పోయింది. జిల్లావ్యాప్తంగా గతేడాదిలో 73,493 మంది రైతులు పేర్లు నమోదు చేయించుకున్నారు.

కుటుంబానికి ఆధారం



నా భర్త జ్వరంతో మృతిచెందాడు. వైద్యం కోసం రూ.2.60 లక్షల అప్పు అయింది. ప్రభుత్వం రూ.5లక్షల బీమా సొమ్ము అందించింది. దీంతో అప్పులు చెల్లించగా మిగతా సొమ్ము కుటుంబానికి ఆధారంగా మారింది. దీంతో ముగ్గురు పిల్లలను పోషిస్తున్నా.

– న్యాత జ్యోతి, మహిళా రైతు, బండపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



రైతుబీమాకు అర్హులైన వారిని చేర్పించేందుకు గ్రామాలవారీగా రైతుల జాబితాను ఏఈవోలు తమ క్లస్టర్‌లో రైతులకు సమాచారం ఇచ్చారు. వచ్చేనెల 5లోపు దరఖాస్తులు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. గడువు దాటితే ఏడాది మళ్లీ ఏడాది ఆగాల్సిందే.

– భాస్కర్ , జిల్లా వ్యవసాయాధికారి

అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్లలోని మినీస్టేడియంలో ఈనెల 30న జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో ఎల్లారెడ్డిపేట మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో జావలిన్ డే సెలబ్రేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అండర్–14లో రాచర్లబొప్పాపూర్‌కు చెందిన చల్ల సాహితి 100, 400 మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానం, అదే గ్రామానికి చెందిన కోల అక్షిత అండర్–18లో 100, 400 పరుగుపందెంలో ద్వితీయస్థానం, అండర్–14 బాలురలో రవికాంత్ 100 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన అల్లె సంయుక్త అండర్–14లో మొదటి స్థానంలో నిలిచినట్లు పీఈటీ ప్రభాకర్ వివరించారు. జిల్లా స్థాయిలో రాణించిన వీరంతా ఆగస్టు 7న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది యువకులు రక్తదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పయ్యావుల రామచంద్రం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రక్తదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఇన్‌చార్జి, లయన్స్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంఎల్‌ఎస్ రావు, హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎగదండి బాబు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నాయిని భాస్కర్‌రెడ్డి, రావుల మల్లారెడ్డి, నంది కిషన్, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, సద్ది లక్ష్మారెడ్డి, చేపూరి రాజేశం, అమరేందర్‌రెడ్డి, గౌరై మల్లేశ్, పాటి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవయ్య కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎగుమంటి ఎల్లారెడ్డి

వీర్నపల్లి : మండలకేంద్రంలో ఇటీవల మృతిచెందిన సీఐటీయూ మండల అధ్యక్షుడు మేకల దేవయ్య కుటుంబాన్ని సీఐటీయూ కార్మికసంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.5వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఎంపీటీసీ అరుణ్ కుమార్, సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ సంఘం నాయకులు, గ్రామ పంచాయతీ కార్మిక సంఘ నాయకులు, హమాలీ కార్మిక సంఘం నాయకులు నరేందర్, రాజేల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంగీతామృతం పంచిన కవలలు



సంగీత కచేరిలో పాల్గొన్న కవలలు వర్షిణి- హర్షిణి

వేములవాడ: వేములవాడకు చెందిన విజయ్–సంధ్యల కవల కుమార్తెలు వర్షిణి– హర్షిణి ఆదివారం రాత్రి స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో నిర్వహించిన సంగీత కచేరిలో తమ గానామృతంతో సభికులను మంత్రముగ్ధుల్ని చేశారు. మహాగణపతిం భజే, ఎందరో మహానుభావులు, బ్రహ్మ కడిగిన పాదమూ, అంతయూ నీవే, బృందావని తిల్లానా, రామచంద్రాయ జానకి.. తదితర కీర్తనలతో సంగీత ప్రియులను మెప్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ, అర్చకులు గోపన్నగారి శివ, చంద్రశేఖర్, రాధాకృష్ణ, సీవీపీ శాస్త్రి, డి.రాఘవాచారి, ఎంసీ అనంతశర్మ, బి.సురేశ్‌బాబు, ఎం.హరిబాబు, ఆలయ విద్వాంసులు రామయ్యశర్మ, అష్టావధాని తిగుళ్ల శ్రీహరిశర్మ, సంకెపల్లి నాగేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.